# నమస్తే తెలంగాణ
## జోగులాంబ గద్వాల వనపర్తి
5 మహబూబ్‌నగర్, శనివారం 7 జూన్ 2025 JOGULAMBA GADWAL WANAPARTHY


- అనుమతి లేకుండానే అడ్మిషన్లు
- విద్యాసంస్థల్లో వసతులు, సౌకర్యాలు కరువు
- అమ్యామ్యాలు ఇస్తే చాలు పర్మిషన్లు
- పాలమూరులో భవనాలు పూర్తికాకముందే అన్ని సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్న నగర పాలక సంస్థ
- విద్యార్థుల జీవితాలతో యాజమాన్యాల చెలగాటం
- మామూళ్ల మత్తులో విద్యాశాఖ
- విద్యాహక్కు చట్టానికి తూట్లు

# ప్రైవేటు ఇష్టారాజ్యం!

### మచ్చుకు రెండు ఇలా..

మహబూబ్‌నగర్ పట్టణం బాలాజీనగర్ ప్రధాన ముఖద్వారం సమీపంలో ఓ బహుళ అంతస్థుల భవనంలో ఓ పాఠశాలను కొత్తగా ఏర్పాటు చేశారు. కానీ ఆ పాఠశాల ప్రచార ఫ్లెక్సీల్లో, ప్రచారంలో మాత్రం తమ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు 2020లో ఉన్నట్లు పేర్కొంటూ ప్రచారం చేస్తూ అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నాయి. అలాగే శేషాద్రినగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఓ పాఠశాల భవన నిర్మాణం చేపట్టి.. పనులు పూర్తికాకపోయినా.. బడి ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తిచేసి అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాయి. విచిత్రం ఏమిటంటే భవనం ఇంకా పూర్తికాక ముందే మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ ఆ పాఠశాలకు శానిటేషన్ సర్టిఫికెట్, సౌండ్ పొల్యూషన్ సర్టిఫికెట్లు జారీ చేయడం కొసమెరుపు. అయితే ఈ పాఠశాల ఫిజికల్ ప్రపోజల్స్ నాట్ సబ్‌మిటెడ్ అనే కారణంతో ఈ పాఠశాల అనుమతులకు సంబంధించిన దస్త్రం డీఈవో కార్యాలయ అధికారులు తిరస్కరించారు. బాలాజీనగర్‌లో నూతనంగా బహుళ అంతస్థులో ఏర్పాటు చేసిన పాఠశాలకు సంబంధించి అనుమతులు మంజూరు కాలేదని.. దరఖాస్తుకు సంబంధించిన ఫైల్ పరిశీలనలో ఉన్నదని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం అధికారులు చెబుతుండగా.. మహబూబ్‌నగర్ ఎంఈవో మాత్రం ఆ పాఠశాలకు గతంలోనే అనుమతి ఉండొచ్చు.. లేకుంటే రిజిస్ట్రేషన్ నెంబర్ ఎలా వేసి ప్రచారం చేస్తారని చెప్పడం అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన, పనితీరుకు అద్దం పడుతోంది. ఆ పాఠశాల భవనంలో మూడేండ్ల కిందట వేరే పాఠశాలను కొనసాగించి, ప్రస్తుతం పాలకొండ బైపాస్ రహదారి సమీపంలోకి మార్చారనేది జగమెరిగిన సత్యం.


పాలమూరులో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం

## పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న స్కూళ్లు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 6 : విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో పాలమూరు జిల్లాలో ప్రతి ఏటా ప్రభుత్వ గుర్తింపులేని ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రైవేట్ స్కూళ్ల యజమానులు అధికారిక గుర్తింపు తీసుకోకుండా విద్యాసంస్థలను నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వారి తల్లిదండ్రులపై ఆర్థికంగా భారం మోపుతున్నారు. ఆకర్షణీయమైన బ్యానర్స్, పోస్టర్లు వేసి పెద్దఎత్తున అడ్మిషన్లు తీసుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పాఠశాలలకు గుర్తింపు లేదని ప్రకటనలు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ఇప్పటికే జిల్లాలో ఎన్నో ప్రైవేట్ స్కూళ్లు ప్రభుత్వం గుర్తింపు లేకుండా వెలిసినా.. బయటపడ్డవి కొన్ని మాత్రమే.. అధికారులు తమ చేతివాటం ప్రదర్శించడంతో వెలుగులోకి రావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

**అధికార యంత్రాంగం తిష్టవేసిన చోటే..**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనే గుర్తింపు లేని పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. కొందరు యజమానులు ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకు అనుమతి తీసుకొని అనధికారికంగా 8, 9, 10 తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొందరైతే గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకొని, అధికారులు నుంచి అనుమతి రాకముందే పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకుంటున్నారు. ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం. మామూళ్ల మత్తులో జోగుతున్న విద్యాశాఖ అధికారుల అండదండలతో ప్రైవేట్ యాజమాన్యాల తీరు 'ఆడిందే ఆట.. పాడిందే పాట'గా సాగుతున్నది. ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యాశాఖ అధికారులు 8 నుంచి 10వ తరగతి వరకు, ఒకటి నుంచి 7వ తరగతి వరకు ఉన్న ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేయాలి. అందులో గుర్తింపు లేని విద్యాసంస్థలపై డీఈవోకు నివేదికను అందజేయాలి. అయితే ఈ ప్రక్రియ సక్రమంగా అమలు కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో అనుమతి లేని పాఠశాలలు ఎన్ని ఉన్నాయో? ఏ అధికారి స్పష్టంగా చెప్పలేకపోతున్నారంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ప్రతి ఏడాది జూన్‌లో అనుమతి లేని పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత జూలై, ఆగస్టు నెలల్లో స్పందిస్తుంటారన్న విమర్శలు ఉన్నాయి.



అనుమతులు లేకున్నా ఏర్పాటైన ఓ పాఠశాల ఫ్లెక్సీ

**మున్ముందు ఇబ్బందులు, ఆర్థిక భారం**

గుర్తింపు లేని పాఠశాలల్లో చదివితే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అనుమతి ఉన్న స్కూళ్లల్లో చదివితేనే తల్లిదండ్రులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లినప్పుడు ఆ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సులభంగా చేర వచ్చు. అదే గుర్తింపు లేకపోతే అడ్మిషన్ కష్టమవుతోంది. కొన్నిసార్లు గుర్తింపు లేకపోతే నిఖార్సైన అధికారులు మధ్యలో ఆ పాఠశాలను మూసేస్తే అక్కడ చదువుతున్న విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోయే ప్రమాదం ఉన్నది. గుర్తింపులేని పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు నేరుగా పబ్లిక్ పరీక్షలకు హాజరు కావడానికి వీలులేదు. అందుకని గుర్తింపు ఉన్న పాఠశాలలతో ఒప్పందం కుదుర్చుకొని, ఆ పాఠశాలల తరపున పరీక్షలు రాయిస్తుంటారు. దీనికోసం అధికంగా ఫీజులు వసూలు చేస్తారు. తల్లిదండ్రులు కూడా చేసేదేమీ లేక రాజీపడుతున్నారు. అడ్మిషన్ సమయంలో గుర్తింపులేని విషయాన్ని చెప్పకుండా గోప్యంగా ఉంచుతున్నారు. చివరిలో అడిగితే తాము గుర్తింపు కోసం దరఖాస్తు చేశామని, అధికారులు అనుమతివ్వలేదని పాఠశాలల యజమానులు వారిపై నెపం మోపుతున్నారు.

**విద్యాహక్కు చట్టానికి తూట్లు..**

ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి కావాలంటే విద్యార్థులకు పక్కా భవన సముదాయం, క్రీడా ప్రాంగణం, ఫిట్‌నెస్ ఉన్న బస్సులు, ఫైర్ సేఫ్టీ అనుమతి పొంది ఉండాలి. కానీ నిబంధనలు, ప్రమాణాలకు విరుద్ధంగా అధికారులు అమ్యామ్యాలకు అలవాటు పడి ప్రైవేట్ పాఠశాలు, వాహనాలకు అనుమతులు ఇస్తున్నారని బాహాటంగానే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇదే అదనుగా యాజమాన్యాలు పాఠశాల భవన నిర్మాణం నుంచి మొదలుకొని ఫీజుల వసూళ్ల వరకు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం పేద విద్యార్థులకు ఉచితంగా బోధన అందించాలి. కానీ అలాంటివి జిల్లాలో చాలా వరకు అమలు కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నూతన పాఠశాలలు మాత్రం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



**అందరి బాధ్యతగా భావించాలి..**

ప్రైవేట్ పాఠశాలలో పిల్లలను చేర్పించేటప్పుడు తల్లిదండ్రులు ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉన్నదా..? లేదా? అని తెలుసుకోవాలి. గుర్తింపు లేని స్కూళ్లను ఏర్పాటు చేసి అడ్మిషన్లు తీసుకుంటే నిబంధనల మేరకు కఠిన చర్యలు ఉంటాయి. ఇది అందరి బాధ్యతగా భావించాలి. కనీసం మా దృష్టికి అయినా తీసుకురావాలి. అప్పుడే వేగంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**- లక్ష్మణ్‌సింగ్, మహబూబ్‌నగర్ అర్బన్ మండల విద్యాశాఖ అధికారి**



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

# పోలీసుల నిర్బంధం

- గద్వాల అఖిలపక్షం నేతల అరెస్టు
- పెద్ద ధన్వాడలో రైతు కుటుంబాలను ఓదార్చేందుకు వెళ్తుండగా అదుపులోకి..
- అయిజ.. పోలీస్‌స్టేషన్‌కు తరలింపు, అనంతరం విడుదల
- పరామర్శకు వెళ్తుంటే అరెస్టులా? అంటూ నాయకుల ఆగ్రహం

అయిజ, జూన్ 6 : గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడ శివారులో బుధవారం ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను రైతులు అడ్డుకున్న ఘటన తెలిసిందే.. ఈ ఘటనలో కంపెనీ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారన్న యాజమాన్యం ఫిర్యాదుతో పోలీసులు 40 మంది రైతులపై కేసులు బనాయించి 12 మందిని గురువారం రిమాండ్‌కు తరలించారు. అరెస్టయిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు జిల్లా అఖిలపక్షం నాయకులు శుక్రవారం పెద్ద ధన్వాడకు అయిజ మీదుగా బయలుదేరారు. అయితే సమాచారం అందుకున్న అయిజ ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కర్నూల్ రోడ్డులోని చిన్నతాండ్రపాడు రహదారిపై వారి వాహనాలను అడ్డగించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేత నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ఆంజనేయులు, వెంకటస్వామి, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌యాదవ్, బహుజన రాజ్య సమితి నాయకులు వాల్మీకి, వినోద్, ఉప్పేర్ నర్సింహతోపాటు పలువురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**అరెస్టులు అప్రజాస్వామికం : అఖిలపక్షం నేతలు**

ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయొద్దని కొద్ది రోజులుగా శాంతియుతంగా పోరాడుతున్న రైతులను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపడం అప్రజాస్వామికమని అఖిలపక్షం నేతలు ధ్వజమెత్తారు. రైతులపై దాడులు చేసి వారిని గాయాలపాలు చేసిన పరిశ్రమ యాజమాన్యం, ప్రైవేటు సైన్యంపై ఎందుకు కేసులు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వ్యవసాయానికి అనుకూలమైన సాగు భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించి, పరిశ్రమలు వద్దని వారిస్తున్న రైతులపై నియంతృత్వ పోకడలతో వ్యవహరిస్తూ కేసులు నమోదు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజ లు ఏకం కావాల్సిన అవసరం ఉన్నదని పిలుపునిచ్చారు. తక్షణమే ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, రిమాండ్‌కు పంపిన రైతులను బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే దీర్ఘకాల ఉద్యమానికి సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. అనంతరం సొంత పూచీకత్తుపై అఖిలపక్ష నాయకులను విడుదల చేశారు.


అయిజ పీఎస్‌లో అఖిలపక్షం నాయకులు

# అరెస్టులతో పోరాటం ఆపలేరు

- పౌరహక్కుల సంఘం గద్వాల జిల్లా అధ్యక్షుడు సుభాన్

అయిజ, జూన్ 6 : శాంతియుతంగా పోరాటం చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ బాధిత గ్రామాల రైతులను అరెస్టులు చేసి జైలుకు పంపితే ఉద్యమాలను ఆపలేరని పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుభాన్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన అయిజ పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని సామరస్య పూర్వకంగా రైతులు ఉద్యమం చేస్తుంటే పోలీసులు కంపెనీ యాజమాన్యంతో కలిసి ఇథనాల్ వ్యతిరేక గ్రామాల రైతులను రెచ్చగొట్టే విధంగా చేసి, రైతులపై కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించడం చూస్తుంటే పోలీసులు, ప్రభుత్వం కావాలనే చేసినట్లు అనిపిస్తుందని మండిపడ్డారు. ఇథనాల్ వ్యతిరేక గ్రామాల రైతుల కుటుంబాలకు పరామర్శించి మనోధైర్యం నింపేందుకు వెళ్తున్న అఖిలపక్ష కమిటీ నాయకులను అరెస్టులు చేసి దుర్మాగంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఇథనాల్ వ్యతిరేక గ్రామాల రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేసి, రైతులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో విజయ్‌భాస్కర్‌రెడ్డి, దానయ్య, ఆశన్న, వాల్మీకి ఉన్నారు.


అయిజలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుభాన్

# పిచ్చికుక్కల స్వైరవిహారం

- వల్లూరులో ఎనిమందికి కాటు
- ఇద్దరి పరిస్థితి విషమం
- కర్నూల్ దవాఖానకు తరలింపు

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 6 : పిచ్చికుక్కల దాడిలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలైన ఘటన ఎర్రవల్లి మండలంలోని వల్లూరు గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం వల్లూరు గ్రామంలో ఓ పిచ్చి కుక్క చాకలి గోపి, గోపాల్, మోదిన్బీ, మద్దమ్మపై మందిని గాయపర్చింది. మరో కుక్క కూడా గ్రామంలోని ఇద్దరితోపాటు పెండ్లికి వచ్చిన మరో ఇద్దరిని గాయపర్చగా గ్రామస్తులు వాటిని వెంబడించి చంపివేశారు. అయితే కుక్కదాడిలో గాయపడిని చాకలి గోపి, గోపాల్ పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో కర్నూల్ దవాఖానకు తరలించారు. గ్రామంలో కుక్కలు పెరిగిపోయాయని వాటి నుంచి ప్రజలను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఆరుబయట నిద్రిస్తుండగా దాడి

- వ్యక్తికి తీవ్ర గాయాలు
- హైదరాబాద్‌కు తరలింపు

వెల్దండ, జూన్ 6 : వీధుకుక్కల దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన వెల్దండ మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం మండల కేంద్రంలోని చర్చి సమీపంలో నివాసం ఉండే జగిలి ఆంద్రయ్య ఆరు బయట నిద్రిస్తున్న సమయంలో ఒక్క సారిగా దాదాపు పది కుక్కలు ఆయనపై దాడి చేశాయి. గమనించిన కుటుంబ సభ్యులు కుక్కలను తరిమికొట్టి తీవ్ర గాయాల పాలైన ఆంద్రయ్యను కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు అటు నుంచి నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. కుక్కల నివారణకు చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం కావడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# తుంగభద్రకు వరద

- ఇన్‌ఫ్లో 7,700 క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 255 క్యూసెక్కులు
- ప్రస్తుత నీటిమట్టం 21.731 టీఎంసీలు


కర్ణాటకలోకి తుంగభద్ర డ్యాంలో నీటి మట్టం

అయిజ, జూన్ 6 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు తుంగభద్ర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా వచ్చి చేరుతోంది. శుక్రవారం టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 7,700 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 255 క్యూసెక్కులు నమోదైంది. గరిష్ఠనీటి మట్టం1633 అడుగులకు గానూ ప్రస్తుతం 1600.16 అడుగుల నీటిమట్టం ఉండగా, 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి ప్రస్తుతం 21.731 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద తగ్గుతోంది. ఇన్‌ఫ్లో 213 క్యూ సెక్కులు ఉండగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 200 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, దిగువన ఉన్న సుంకేసుల బారాజ్‌కు 300 క్యూసెక్కులు వరద చేరుతోంది. ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది.

**కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి**

అమరచింత, జూన్ 6 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ ప్రాంతాల్లోని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో నిరంతరంగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుందని విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు ఎస్ఈ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ భాగంలో ఉన్న జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో గురువారం 1. 155 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, ఇప్పటి వరకు 13,160 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని, ఆత్మకూర్ మండలంలోని దిగువ జల విద్యుత్ కేంద్రంలో 1.513 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి కాగా ఇప్పటి వరకు 14,242 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు చెప్పారు. శుక్రవారం కూడా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

# బీఆర్ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ కార్యకర్త దాడి

- గులాబీ కార్యకర్తపైనే కేసు నమోదు చేసిన వైనం
- అమరచింత ఎస్సైని నిలదీసిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం

అమరచింత, జూన్ 6 : పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడి చేసుకొని గాయాలపాలు కాగా ఇరువురు అమరచింత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఎస్సీ కాలనీకి చెందిన అరుణ్‌కుమార్, రవితేజలు బుధవారం రాత్రి గొడవపడవగా ఇద్దరు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అయితే అరుణ్‌కుమార్ మెడలోని బంగారు చైన్ కనిపించకపోవడంతో రవితేజపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే రవితేజ కడుపు భాగంలో గాయం కాగా ఎస్సై గాయానికి కారుకుడైన అరుణ్‌కుమార్‌ను వదిలిపెట్టి గాయపడిన వ్యక్తినే రెండు రోజులుగా పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ పేరుతో వేధిస్తున్నారని విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం అమరచింత పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఎస్సై సురేశ్‌ను నిలదీసి రవితేజను విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అరుణ్‌కుమార్ రవితేజపై దాడి చేసి గాయపర్చిన ఎస్సై సురేశ్ మాత్రం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తు గాయపడిన వ్యక్తిపైనే కేసు నమోదు చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

## గ్యాస్ లీకై.. ఐదు మందికి గాయాలు

గట్టు, జూన్ 6 : మండలంలోని ఆలూరులో సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఐదు మందికి గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే పూలుకుంట దుబ్బన్న ఇంట్లో సిలిండర్ ఖాళీ కావడంలో రిఫిల్ సిలిండర్ తెచ్చుకున్నారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు గ్యాస్ కనెక్షన్‌ను ఇస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో సరస్వతి, రమేశ్, రంగన్న, వెంకటేశ్‌తోపాటు మరొకరికి గాయాలయ్యాయి. కాగా తీవ్ర గాయాలకు గురైన సరస్వతి, వెంకటేశ్‌ల పరిస్థితిల విషమంగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

# ప్రయాణం.. నరకప్రాయం

- రాత్రయితే కొల్లాపూర్‌కు బస్సులు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

కొల్లాపూర్, జూన్ 6 : బ్రిటీష్ రాజులు, నిజాం నవాబులు మెచ్చిన సురభిరాజుల సంస్థానంగా కొల్లాపూర్ కీర్తి ప్రతిష్టలు సాధించింది. ప్రకృతి ప్రేమికులను, ఆధ్యాత్మక వాదులను నిత్యం ఆకర్షించే నల్లమల వంపులు, సప్తనదుల సోయగాలకు నెలువుగా వున్న కొల్లాపూర్‌కు ఆర్టీసీ సర్వీసులు మచ్చను తెస్తున్నాయి అనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొల్లాపూర్‌లో పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో తెలంగాణ రాష్ట్ర నలమూలల నుంచి మాత్రమేకాక ఇతర రాష్ట్రాల నుంచి కొల్లాపూర్‌కు పర్యాటకులు వస్తుంటారు. కానీ వచ్చిన వారు తిరిగి వెళ్లేందుకు సరైనా రవాణా సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులను పడుతున్న పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా దవాఖానల అవసరాల నిమిత్తం అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లిన వారు రాత్రి సమయాల్లో కొల్లాపూర్ రావాలంటే జంకుతున్నారు. తప్పని పరిస్థితిలో కొల్లాపూర్ ఆర్టీసీ బస్సును ఎక్కాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ విషయాన్ని ఎన్నోసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ప్రయాణికులు కొల్లాపూర్ రావడానికి నరకయాతన అనుభవిస్తున్నారు. కొల్లాపూర్ డిపో నుంచి హైదరాబాద్‌కు 29 సర్వీసులు, పెబ్బేరుకు 9, వనపర్తికి 8 సర్వీసులు నడుస్తున్నాయి. అయితే సాయంత్రం పూట బస్సుల కెపాసిటీకి మించి బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సు సర్వీసులు లేకపోవడంతో ఒక బస్సులో వంద మందికిపైగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. పుట్‌పాత్‌పై ప్రయాణం చేస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు తప్పితే ప్రయాణికుల సంఖ్య కు అనుగుణంగా బస్సులను నడపడం లేదు. కొల్లాపూర్ నుంచి బస్సు సర్వీసులు రాత్రి ఎనిమిది గం టలకే బంద్ అవుతున్నాయి. ఎన్నోసార్లు మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కొల్లాపూర్ నియోజకవర్గానికి బస్సులే కరవయ్యాయి.


జడ్చర్ల బస్టాండ్‌లో బస్సును ఎక్కేందుకు స్థలం లేక కండక్టర్ నిలదీస్తున్న ప్రయాణికులు

**రాత్రి అయిందంటే రోజు మారాల్సిందే..**

హైదరాబాద్ నుంచి సాయంత్రం సమయంలో కొల్లాపూర్ సర్వీసు అధ్వానంగా వున్నది. రాత్రి 8:30 గంటలు దాటింది అంటే హైదరాబాద్‌కు కొల్లాపూర్‌కు రావాలంటే క్యాలెండర్‌లో రోజు మారాల్సి వస్తోంది. కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు సాయంత్రం ఆరు గంటలకే చివరి బస్సు బయల్దేరుతోంది. వివిధ పను ల నిమిత్తం రాజధాని వెళ్లిన వారు రాత్రి ఎనిమిదిన్న ర తర్వాత కొల్లాపూర్‌కు రావాలంటే రాత్రి 11గంటల వరకు ఎదురు చూడాలి. దీంతో ఎన్ని పనులున్నా వదులుకొని హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో 8:30 గంటల బస్సుకు ఎక్కేందుకు ప్రయాణికులు వందలాదిగా పోటీలు పడుతున్నారు. దీంతో ఎంజీబీఎస్‌లోనే 8:30 గంటల బస్సుకు 120 మందిదాక ప్ర యాణికులు బస్సు ఎక్కుతున్నారు. ముసలి ముతక బస్సు ఎక్కేందుకు అవకాశం లేక అవస్థలు పడే స్థితి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. 11 గం టల అఖరి బస్సుకు అయితే కష్టపడి ఎక్కినా సీట్లు దొరకడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరాంఘర్, శివరామ్‌పల్లి తదితర బస్సు పాయింట్ల వద్ద వేచి చూసే ప్రయాణికులకు ప్రైవేట్ వాహనాలు తప్పా ఆర్టీసీ సర్వీసు ఎక్కే అవకాశమే లేకుండా పోయింది. హైదరాబాద్‌లో స్టాండింగ్‌లో వున్న వారు కొల్లాపూర్‌కు వచ్చేంతే వరకు అంటే దాదాపు నాలుగు గంటలకు పైగా స్టాండింగ్‌లోనే ప్రయాణించవాల్సి వస్తోందని చంటి పిల్లలతో, గర్భిణులతో, దవాఖానల్లో వైద్యం చేయించుకొని తిగివస్తున్న రోగులు సైతం నరకయాతన అనుభవిస్తున్నామని 'నమస్తే తెలంగాణ'తో వాపోయారు.

**నిర్లక్ష్యం వీడని ఆర్టీసీ**

రాజధాని నుంచి 8:30 తర్వాత 11 గంటల వరకు బస్సు సర్వీసు రావడానికి మధ్యలో దాదాపు మూడు గంటల సమయం పడుతోంది. బస్సుల మధ్య గ్యాప్‌ను భర్తీ చేయాలని ప్రయాణికులు, ప్రజా సంఘాల నాయకులు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కొంతమంది ఆరోపిస్తున్నారు. మంత్రి నియోజకవర్గ కేంద్రంలోనే ఆర్టీసీ నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుంటే గ్రామీణ రవాణా వ్యవస్థ ఎంత అస్తవ్యస్తంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గురువారం రాత్రి ఎనిమిదిన్నర గంటలకు బస్సు ఎక్కేందుకు సాధ్యం కాకపోవడంతో అఖరి బస్సు 11గంటలకు ఎక్కేందుకు వెళ్లితే 115 మంది ప్రయాణికులు ఎక్కడంతో స్టాండింగ్‌తోనే బస్సు హైదరాబాద్ నుంచి కొల్లాపూర్ వచ్చినట్లు చెప్పారు.

**బస్సు ఎక్కాలంటే భయమేస్తోంది**



హైదరాబాద్ నుంచి రాత్రి కొల్లాపూర్ రావాలంటే భయంగా వుంటుంది. ఎంజీబీఎస్‌లో బస్సు ఎక్కిన సీట్లు దొరకడం కష్టంగా ఉంటుంది. బస్సులో ఉపిరి కూడా ఆడదు. దవాఖానకు వెళ్లి కొల్లాపూర్ బస్సు ఎక్కితే మళ్లీ దవాఖాన కోసం బస్సు ఎక్కవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని 8:30 తర్వాత ఆర్టీసీ సర్వీసును నడపాలి.

– జక్కుల నరసింహ, పెద్దకొత్తపల్లి

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతా..**

హైదరాబాద్ నుంచి రాత్రి ఎనిమిదిన్నర గంటల తర్వాత మరో సర్వీసును ఎలా నడపాలో అర్థం కావడం లేదు. డిపో మేనేజర్ సెలవులల్లో ఉన్నాడు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్తాను. – డిపో ఇన్‌చార్జి రత్నమ్మ